
తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
కరీంనగర్ - నిజామాబాద్
రాజన్న సిరిసిల్ల | కామారెడ్డి
పెద్దపల్లి | జగిత్యాల
మంగళవారం,15.10.2024 | పేజీలు : 08
Follow :



## ధరణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలి




జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**పెద్దపల్లి,అక్టోబర్ 14(జనంసాక్షి) :** ధరణి దరఖాస్తులను తహసీల్దారులు ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆదేశించారు.సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ధరణి దరఖాస్తులు, ఎల్.ఆర్.ఎస్ వంటి పలు అంశాల పై అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ తో కలిసి అధికారులతో రివ్యూ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, జిల్లాలో పెండింగ్ ధరణి దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలని, మండలాలలో పెండింగ్ ధరణి దరఖాస్తుల సంఖ్య సింగల్ డిజిట్ దాటకుండా చూడాలని కలెక్టర్ తెలిపారు. ధరణి ద్వారా వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అధికారులు క్లియర్ చేయాలని పెండింగ్ పెట్టవద్దని కలెక్టర్ పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ భూములకు ఫెన్సింగ్ ఏర్పాటు చేసేందుకు అవసరమైన ఖర్చుల ప్రతిపాదనలు అందజేస్తే వెంటనే నిధులు మంజూరు చేస్తామని, ప్రభుత్వ భూములకు ఫెన్సింగ్ త్వరగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.మండలాల పరిధిలో ఎల్.ఆర్.ఎస్ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని, త్వరితగతిన భూ క్రమబద్ధీకరణ కార్యక్రమాన్ని పూర్తి చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో రెవెన్యూ డివిజన్ అధికారులు బి.గంగయ్య , వి.హనుమ నాయక్,తహసిల్దారులు ,సంబంధిత అధికారులు ,తదితరులు పాల్గొన్నారు.

## ప్రాణం తీసిన అతివేగం..

- పండుగ పూట రెండు కుటుంబాల్లో విషాదం
- బైక్ చెట్టుకు ఢీకొని ఇద్దరు యువకుల దుర్మరణం





**వేములవాడ రూరల్(జనంసాక్షి):** ద్విచక్ర వాహనం చెట్టును బలంగా ఢీకొనడంతో ఇద్దరి యువకులు దుర్మరణం చెందిన విషాద సంఘటన వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేట గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన విక్కుర్తి దిలీప్ (22) సురా అనిల్ (21) అనే ఇద్దరు స్నేహితులు గ్రామంలో ఆదివారం రాత్రి నిర్వహించిన దుర్గామాత నిమజ్జన వేడుకల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. అప్పటివరకు ఎంతో సంతోషంగా వున్న ఇద్దరు మిత్రులు దుర్గామాత నిమజ్జనం తర్వాత నూతనంగా కొనుగోలు చేసిన బైకుపై సరదాగా మామిడిపల్లి రహదారి వైపు వెళ్లారు. అతివేగంతో బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును బలంగా ఢీకొనడంతో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు 108 కి సమాచారం అందించిన స్పందించకపోవడంతో అటువైపుగా పెట్రోలింగ్ కు వచ్చిన పోలీసులు క్షతగాత్రులను తమ వాహనంలోనే వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి పరిస్థితి విషమంగా ఉందని తెలపడంతో మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం పెద్ద ఆసుపత్రికి తరలిస్తున్న సమయంలో మార్గమధ్యలో ఇద్దరు యువకులు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలాపించారు. మృతదేహాలను సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఎంతో భవిష్యత్తు ఉన్న ఇద్దరి యువకులు అర్ధాంతరంగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబ సభ్యులతో పాటు బంధు మిత్రుల రోదనలతో హన్మాజీపేట గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుల ఇద్దరి తండ్రులు ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశంలో ఉన్నట్లు సమాచారం.

## నైపుణ్యంతో మంచి ఉపాధి

**సింగరేణి ఆర్‌జీ-1 నిర్వహించిన ఉపాధి శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్..**



గోదావరిఖని, జనంసాక్షి : ప్రస్తుతం మార్కెట్ పరిస్థితులలో మనకు నైపుణ్యాలు ఉంటేనే మంచి ఉపాధి సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు.సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రామగుండం లోని సింగరేణి ఆర్జి 1 ఆధ్వర్యంలో నిర్వహించిన యువతకు ఉపాధి శిక్షణ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌తో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, యువతకు నైపుణ్య శిక్షణ అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, అందులో భాగంగా సింగరేణి ఆధ్వర్యంలో నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని రామగుండంలో ఏర్పాటు చేశామని అన్నారు.రామగుండంలో ఏర్పాటుచేసిన నైపుణ్య శిక్షణ కేంద్రం ద్వారా యువతకు ఉపాధి లభించేలా అవసరమైన నైపుణ్యాలు అందిస్తున్నామని, ఎల్ అండ్ టీ, ఐసిఐసి వంటి ప్రముఖ సంస్థల సహకారంతో యువతకు మార్కెట్ లో డిమాండ్ ఉన్న నైపుణ్యాలను శిక్షణ అందిస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు.యువత నైపుణ్యాలు నేర్చుకునేందుకు ముందుకు రావాలని అన్నారు. వచ్చే రెండు నెలలు అగ్నివీర్ నోటిఫికేషన్లు కూడా వస్తాయని, ఇందులో పాల్గొనాలి అనుకున్న యువకులకు అవసరమైన శిక్షణ అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని అన్నారు.యువత దగ్గర మంచి నైపుణ్యాలు ఉంటే ఉపాధి లభిస్తుందని, మార్కెట్ లో మనకు మంచి డిమాండ్ ఉంటుందని, నైపుణ్యాలను మనం ఎప్పటికప్పుడు అప్‌గ్రేడ్ చేసుకోవాలని అన్నారు.రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ , జీఎంఆర్ వరలక్ష్మి ఆధ్వర్యంలో 150 మంది యువకులకు నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.రామగుండం ప్రాంతంలో ఉన్న ఎన్టిపిసి, సింగరేణి, మెడికల్ కాలేజ్, ఆర్.ఎఫ్.సి.ఎల్ లో స్థానికులకు ఉపాధి కల్పించేలా చూడాలని ఎమ్మెల్యే కలెక్టర్ ను కోరారు. ఆర్‌జి-1 జియం డి.లలిత్‌కుమార్, రామగుండం అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎం.రమేష్, ఆర్‌జీ-1 సిఎంఓఏఐ అధ్యక్షులు బి.మల్లేశం, ఎస్ఈఉడబ్ల్యూఏ అధ్యక్షులు డి.అనిత-లలిత్‌కుమార్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నియోజకవర్గం కన్వీనర్‌గా ఎడ్ల జోగిరెడ్డి



**కరీంనగర్ బ్యూరో / తిమ్మాపూర్, అక్టోబర్ 14**
తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మానకొండూరు నియోజకవర్గ కన్వీనర్ గా ఎడ్ల జోగిరెడ్డి నియామకం చేశారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం కేంద్రానికి చెందిన ఎడ్ల జోగి రెడ్డి గత రెండు దశాబ్దాల క్రితం తెలంగాణ ఉద్యమం పోరాటంలో చురుకైన పాత్ర పోషించారు. ఉద్యమ పోరాట సమయంలో అనేక మంది మహానేతలు, నాయకులతో కలిసి ఉద్యమంలో పాల్గొని చురుకైన పాత్ర పోషించారు. తెలం గాణ ఉద్యమంలో ఎడ్ల జోగిరెడ్డి చేసిన సేవలను గుర్తించిన రాష్ట్ర తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కన్వీనర్ చీమ శ్రీనివాస్ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మానకొండూరు నియోజక వర్గం కన్వీనర్ గా ఎడ్ల జోగి రెడ్డిని నియామకం చేసినట్లు సోమవారం పత్రిక ప్రకటనలు ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా ఎడ్ల జోగిరెడ్డి మాట్లాడుతూ...నా నియామకానికి సహకరించిన ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర చైర్మన్ చీమ శ్రీనివాస్, ముఖ్య సలహాదారుడు ఓరుగంటి ఆనంద్, జిల్లా చైర్మన్ కనకం కుమారస్వామి లతో పాటు వివిధ మండలాల అధ్యక్షులు, రాష్ట్ర నాయకు లకు, జిల్లా బాధ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ఉద్యమం పుట్టి దాదాపు 23 ఏళ్లు పూర్తిగా అయ్యిందని, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయిన తర్వాత అధికారం చేపట్టిన టిఆర్ఎస్ ప్రభుత్వం అసలైన తెలంగాణ ఉద్యమకారులు, అమరవీరులు వారి కుటుంబాలను విస్మరించిందని అన్నారు. ఉద్యమంలో ఉద్యమకారులు, అమరవీరులు, సబ్బండ వర్గాల పోరాటంతోనే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాధ్యమైంది అన్నారు. కానీ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత మొదటిసారి అధికారం చేపట్టిన టిఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యమంలో చురు కైన పాత్ర పోషించిన మహానేతలు, జర్నలిస్టులను విస్మరించిందన్నారు. దాని ఫలితమే ఇటీవల టి ఆర్ఎస్ ప్రభుత్వం అధికారం కోల్పోయిందని అన్నా రు. కనీసం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అయినా తెలం గాణ ఉద్యమ పోరాటంలో పాల్గొన్న ఉద్యమకారులు, అమరవీరులు వారి కుటుంబాలు, నాయకులను, కార్యకర్తలను, జర్నలి స్టులను గుర్తించి వారికి తగిన ప్రాధాన్యత ఇచ్చి, అన్ని రకాలుగా సహకా రాలు అందజేయాలని విజ్ఞప్తి చేశారు

## మరపురానిది స్నేహబంధం..




**వేములవాడ (జనంసాక్షి):**మధురమైన స్నేహబంధం.. మరపురానిది స్నేహబంధం.. సష్టిలో అన్నింటినీ మించి అందరినీ అలరించే బంధం స్నేహబంధం. జీవితంలో పూర్వవిద్యార్థుల అ'పూర్వ' కలయిక ఒక మరపురాని, మరువలేని అమూల్య ఘట్టం. అలాంటి అ'పూర్వ' ఘట్టానికి వేదికైంది వేములవాడ రూరల్ మండలంలోని హన్మాజీపేట పాఠశాల. (10వ తరగతి:2006-2007) 17 ఏళ్ల క్రితం కలిసి చదివిన మిత్రులంతా ఆదివారం ఒక్కచోట చేరారు. గత మధుర జ్ఞాపకాలు, స్మృతులను 'యాది' చేసుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులను నేర్పిన గురువులను సత్కరించి, వారి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం ఆటపాటలు, నృత్యాలతో ఉత్సాహంగా గడిపారు. ఈ అపూర్వ సమ్మేళనానికి గురువులు శ్రీనివాస్, సంజీవరెడ్డి, బాలకిషన్ రావు, శేఖర్, సుధాకర్ రెడ్డి, అంజయ్య గౌడ్, దత్తత్రేయ, మాధవీలత హాజరయ్యారు. పరమదించిన తమ గురువులు పవన్, మిస్కిం పాశ, స్నేహితుడు మేర్పుల అనిల్ రెడ్డిలకు కార్యక్రమ ప్రారంభానికి ముందు నివాళులర్పించారు.

**శాత్రజుపల్లి జెడ్‌పిహెచ్‌ఎస్‌లో..**
**వేములవాడ(జనంసాక్షి):**బాల్యం ఒక మధుర జ్ఞాపకం కలసి పంచుకునే కలల ప్రపంచం జెడ్.పి.హెచ్.ఎస్ హైస్కూల్ శాత్రజుపల్లి 2002-2003 పదవ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కలిసికొని బాల్యంలోని మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.దాదాపు 21 సంవత్సరాల తర్వాత కలుసుకొని పూర్వపు రోజులను గుర్తు చేసుకున్నారు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు.పూర్వ విద్యార్థిని విద్యార్థులు అర్చన,సుజాత,సరిత, రమ్య,కవిత,గౌతమి,సుజాత, కవిత,సునీత,గుడిసె అనిల్, ముసుకు సంతోష్ రెడ్డి,గుడిసె వినోద్,దాసరి ప్రవీణ్,గుడిసె అనిల్ కుమార్,సామనపల్లి యువన్, లింగాల రాకేష్,శ్రావణ్ ఎండి షబ్బీర్,మహేందర్,గుడిసె ప్రభుదాస్,పెంట అశోక్,సందరగిరి ప్రకాష్,లింగంపల్లి ఆంజనేయులు, లింగాల పౌలు,గుడిసె ప్రభాకర్, పొన్నాల శ్రీనివాస్,కృష్ణ తదితరులు ఉన్నారు.



# క్రీడలను ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యం

**గత ప్రభుత్వం 10 సం క్రీడారంగాన్ని విస్మసించింది**
**రానున్న రోజుల్లో క్రీడలకు పెద్దపీట**
**మండల, జిల్లా స్థాయిలో కోచింగ్ సెంటర్లు**



**సుల్తానాబాద్,అక్టోబర్ 14(జనంసాక్షి) :** సుల్తానాబాద్ పట్టణ కేంద్రంలో సీఎం కప్ టార్చి రిలే క్రీడా జ్యోతి ర్యాలీ కార్యక్రమాన్ని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు హాజరై ప్రారంభించారు.అనంతరం శాస్త్రి నగర్ నుండి జూనియర్ కాలేజీ వరకు ర్యాలీలో పెద్దపల్లి ఎమ్మెల చింతకుంట విజయ రమణారావు పాల్గొని మాట్లాడుతూ కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోనే సుల్తానాబాద్ క్రీడాకారులకు పుట్టినిల్లు అని ఇక్కడి నుండి జాతీయ అంతర్జాతీయ క్రీడాకారులు ఉన్నారని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావుపేర్కొన్నారు. గత ప్రభుత్వం 10 సంవత్సరాలు క్రీడలను విస్మర్శించి పాలన కొనసాగించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహజంగా వాలీబాల్ క్రీడాకారుడు కాబట్టి క్రీడలను ప్రోత్సహించి జాతీయ అంతర్జాతీయ క్రీడాకారులను తయారు చేయాలని సంకల్పంతో క్రీడలకు కోట్లాది రూపాయల నిధులు వెచ్చిస్తున్నారని విజయ రమణారావు అన్నారు. ఈ నెల 21వ తేదీ నుండి ప్రతి మండల జిల్లా హెడ్ క్వార్టర్స్ లలో కబడ్డీ వాలీబాల్ కోకో ఇతరత్రా క్రీడలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర క్రీడా శాఖ మంత్రితో చర్చించి ఒలంపిక్ క్రీడలను తెలంగాణ ప్రాంతంలో నిర్వహించాలని ఇక్కడి క్రీడాకారులు జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని వివరించారని . క్రీడాకారులను ప్రోత్సహించాలనే సంకల్పంతోనే క్రికెటర్ క్రీడాకారుడు సిరాజ్ జానీ, నికిత్ జరిన్, లకు డిఎస్పి ఉద్యోగాలు ఇచ్చి ప్రోత్సహించారని వరంగల్ క్రీడాకారుడికి కోటి రూపాయల నగదును అందించి వరంగల్ నడిబొడ్డులో ఆరు వందల గజాల స్థలాన్ని కేటాయించి ప్రోత్సహిస్తున్నారని పేర్కొన్నారు. క్రీడలపై ప్రత్యేక మక్కువ చూపిస్తున్నారని రానున్న రోజుల్లో ప్రతి మండల కేంద్రంలో అలాగే జిల్లా కేంద్రంలో కోచింగ్ జిమ్ము సెంటర్ లను నెలకొల్పే సంకల్పంతో ముఖ్యమంత్రి ముందుకు పోతున్నారని పేర్కొన్నారు. సీనియర్ క్రీడాకారులు నూతనంగా క్రీడారంగంలోకి ప్రవేశిస్తున్న క్రీడకాలను ప్రోత్సహించి వాళ్లను క్రీడారంగంలో రాణించే విధంగా సహకారం అందించాలని అన్నారు. సుల్తానాబాద్ లో కేలో ఇండియా కోచింగ్ సెంటర్ ను నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు .అనంతరం క్రీడారంగంలో రాణించిన క్రీడాకారులను శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్ లాల్ సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్ గాజుల లక్ష్మి రాజమల్లు ,మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ బిరుదు సమత కృష్ణ, డివైస్ ఓ సురేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మినుపల ప్రకాష్ రావు, అంతటి అన్నయ్య గౌడ్ ,సాయిరి మహేందర్ , వేగోళం అబ్బాయ్య గౌడ్ , చిలుక సతీష్ ,స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులు రవీందర్ తోపాటు వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు ,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పత్తి కొనుగోళ్ళు ప్రారంభించడానికి అన్ని ఏర్పాట్లు చేపట్టాలి



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 14 (జనం సాక్షి)**వచ్చే నవంబర్ మొదటి వారంలో జిల్లాలో పత్తి కొనుగోళ్లు ప్రారంభించుటకు అన్ని ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో నవంబర్ మొదటి వారంలో పత్తి కొనుగోళ్లు ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. పత్తి క్వింటాలుకు సి.సి. ఐ. కనీస మద్దతు ధర రూ. 7,521 లుగా నిర్ణయించడం జరిగిందని తెలిపారు. వ్యవసాయ అధికారుల సమాచారం మేరకు జిల్లాలో సుమారు 2.36 లక్షల క్వింటాళ్ల పత్తి సేకరణకు అవకాశం ఉందని తెలిపారు. ఇప్పటికే ప్రైవేటు ధర క్వింటాలుకు రూ. 7500 లకు పైగా ఉన్నట్లు సమాచారం ఉందని అధికారులు తెలిపారు.జిల్లాలో మద్నూర్ వ్యవసాయ మార్కెట్ పరిధిలో 8 జిన్నింగ్ మిల్లులు ఉన్నాయని, కొనుగోళ్లు చేసి ఆ మిల్లులకు పంపించడం జరుగుతుందని సి.సి. ఐ. అధికారులు తెలిపారని అన్నారు. ముఖ్యంగా కొనుగోళ్ళ గురించి విస్తృత ప్రచారం నిర్వహించాలని మార్కెటింగ్ అధికారులకు సూచించారు. గతంలో లాగా తెలుగు, మరాఠీ భాషల్లో రికార్డింగ్ చేసి ప్రచారం చేయాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అగ్నిమాపక యంత్రాలను అందుబాటులో ఉంచాలని మిల్లర్లకు తెలిపారు. రైతుల నుండి కొనుగోలు చేసిన పత్తికి మూడు రోజుల్లో చెల్లింపులు చేయాలని అన్నారు. అనంతరం పోస్టర్ ను కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి.శ్రీనివాస్ రెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారిని రమ్య, జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్, సి.సి. ఐ. ఇన్చార్జి ఓబుల్ రెడ్డి, డిఎస్పీ , జిల్లా ఫైర్ అధికారి,తూనికలు కొలతల అధికారి, ఆర్టీవో, వివిధ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నిర్మాణం పూర్తి చేసిన గదిని దేవాలయంకు అప్పగించిన దాత



**ఎడపల్లి, అక్టోబర్ 14 ( జనంసాక్షి ) :** ఎడపల్లి మండలం జాన్కంపేట్ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో రెండు లక్షల రూపా యలతో నిర్మించిన గదిని దాత రాయిపల్లి శ్రీనివాసరావు సంతోషిని దంపతులు సోమవారం ఆలయ ఈవో గింజుపల్లి వేణుకు అప్పగించారు. జానకంపేట్ గ్రామానికి చెందిన రాయపల్లి శ్రీనివాసరావు సంతోషిని ( కుమ్మి టీచర్ ) లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ ప్రాంగణంలో అన్న ప్రసాదం గది పక్కన రెండు లక్షల రూపాయలతో గదిని నిర్మించి నేడు ఆలయ ఈవోకు అందించడం జరిగింది. అనంతరం ఈవో దాత దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి గింజుపల్లి వేణు, పరిశీలకురాలు బి కమల, ఆలయ పరిచారిక శ్రీరంగం కొండమాచార్యులు, సిబ్బంది రఘు పాల్గొన్నారు. కాగా ఈ గదిని వంట పాత్రలను భద్రపరిచేందుకు వాడనున్నారు.

## ఓటర్ల నమోదు ప్రక్రియ కరపత్రం విడుదల

**బిచ్కుంద అక్టోబర్ (జనంసాక్షి)**పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ప్రక్రియకు సంబంధించిన జుక్కల్ యూత్ ఫోరమ్ కరపత్రాన్ని కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గ కేంద్ర తహసీల్దార్ హీమబిందు, ఎంపీడీవో శ్రీనివాస్ సోమవారం నాడు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆన్లైన్ విధానంలో 18 ఫారంను పూర్తి చేయాలని, అదేవిధంగా ఆఫ్ లైన్ విధానంలో తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టరేట్ కార్యాలయాలలో నవంబర్ 6 వ తేదీ వరకు సమర్పించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ ఫోరం సభ్యులు మారుతి, సాయికర్ణ, గాయక్వడ్ విఠల్, బండారి లక్ష్మణ్ వాగ్మరే, ఆర్మాన్ తదితరులు పాల్గొన్నారు.



# కలువల వెంకటేశులు సన్మానించిన ఎమ్మెల్యే

**సుల్తానాబాద్,అక్టోబర్ 14(జనంసాక్షి):** సీఎం కప్ క్రీడా పోటీలను ప్రారంభించేందుకు విచ్చేసిన పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు సోమవారం క్రీడాకారుడు కల్వల వెంకటేశునుశాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో రాజమల్లు పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

## స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ



**పెద్దపల్లి,అక్టోబర్ 14(జనంసాక్షి) :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి అర్జీలను సత్వరమే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు జే.అరుణ శ్రీ అన్నారు.సోమవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని ప్రజల అర్జీలను స్వీకరించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యత నిచ్చి అర్జీదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అధికారులు, వివిధ శాఖల సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఏసిపి కార్యాలయం ముందు దుర్గామాత విగ్రహంతో నిరసన మండప నిర్వాహకుల బైటాయింపు ధర్నా




**ఆర్మూర్, అక్టోబర్ 14 ( జనం సాక్షి):** ఆర్మూర్ పట్టణంలోని ఏసిపి కార్యాలయం ముందు పెద్ద ఎత్తున దుర్గామాత నిర్వాహకులు దుర్గామాత విగ్రహంతో నిరసన తెలిపారు. శాంతియుతంగా నిబంధనల మేరకు నిమజ్జనం రోజున రెండు బాక్సులు, సౌండ్ సిస్టంతో నిర్వహిస్తున్న నిర్వాహకులపై సౌండ్ సిస్టమ్ ను సీజ్ చేయడం ఏంటని బిజెపి నాయకులు, మం డప నిర్వాహకులు ఏసిపి కార్యాల యం ముందు బైఠాయించి సోమవారం ధర్నాకు దిగారు.బిజెపి నాయకులు జీవీ నరసి ంహారెడ్డి,కలిగోట గంగాధర్, మందుల బాలు, ఉదయ్, కలిగోట ప్రశాంత్ లు మాట్లాడుతూ హిందూ వాహిని, బజరంగ్ దళ్ నిర్వహిస్తున్న దుర్గామాత మండపాల నిర్వాకుల సౌండ్ సిస్టంలను రాత్రిపూట పోలీస్ స్టేషన్ కు తరలించడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. ఒకపక్షం ఓటు బ్యాంకు కొరకు దుర్గామాత మండపాల నిర్వాహకులను బాధించడం సరికాదన్నారు. మెజారిటీ హిందువుల మనోభావాలను దెబ్బతీస్తే దాని పరిణామాలు ఊహించలేరని హెచ్చరించారు. శాంతియుతంగా, నిబంధనలో మేరకు, కోలాటాలతో, ఆటపాటలతో నిమజ్జనం ఉత్సవాలను జరుపుతున్న వారిపై దుశ్చర్యకు పాల్పడ దంపై మండిపడ్డారు. హిందూ సమాజానికి ఏసిపి బహిరంగ క్షమాపణలు చెప్పాలంటూ మాట్లాడారు.

# బోధన్‌లో డిగ్రీ కళాశాలల నిరవధిక బంద్




**బోధన్, అక్టోబర్ 14 ( జనంసాక్షి ) :** గత మూడు సంవత్సరాల నుండి డిగ్రీ, పీజీ కళాశాలలకు ఫీజు రియంబర్స్ మెంటు, ఉపకార -వేతనాలు ప్రభుత్వం ఇవ్వకపోవడంతో అత్యంత క్లిష్ట పరిస్థితులను కళాశాలలు, ఉద్యోగులు యాజమాన్యాలు ఎదుర్కొంటున్నాయని అయితే ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించే వరకు ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్య సంస్థ పిలుపు మేరకు డిగ్రీ కళాశాల బంద్ నిర్వహించనున్నట్లు డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్య ప్రతినిధులు సోమవారం నిరసన తెలపడంతో పాటు కళాశాలలకు బంద్ ప్రకటించారు. కళాశాలల ఉద్యోగుల జీతాలు, భవనాల అద్దెలు, విద్యుత్ బిల్లులు, మున్సిపల్ పన్నులు, నిర్వహణ ఖర్చులు భరించలేక కళాశాలలను నిర్వహించటం కష్టతరంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నిర్వహణ కోసం బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదని, పాత అప్పులు తీర్చలేక పోతున్నామన్నారు. అద్దె భవనంలో కొనసాగే కళాశాలల అద్దె కోసం యజమానులు ఒత్తిడి తెస్తున్నారని వారు స్పష్టం చేశారు. ఈ పరిస్థితుల్లో తెలంగాణ ప్రభుత్వంలోని నాయకులను, మంత్రులను వివిధ శాఖల అధికారులను అందరిని కలిసి కళాశాలల పరిస్థితిని వివరించినప్పటికీ ప్రభుత్వం నుండి ఎలాంటి సమాధానం రాలేదని అందువల్ల నేటి నుండి కళాశాలల నిరవధిక బంద్ కు పిలుపునివ్వడం జరిగిందని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ యూనివర్సిటీ బోధన్ సమన్వయ కర్త మిమ్స్ కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాస రాజు, ఉషోదయ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ సూర్య ప్రకాష్, ఎస్వి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ సాయరెడ్డి, విజయసాయి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ జావీద్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ వైస్ ఎంపీపీ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



**యైటింక్లయిన్ కాలనీ అక్టోబర్ 14 (జనంసాక్షి) :** ఉమ్మడి కమాన్‌పూర్ మండల మాజీ ఉపా ధ్యాక్షుడు ఎంపీ పీ బెల్లంకొండ విజేందర్‌రెడ్డి, కరుణాకర్ రెడ్డి కుటుంబాన్ని రామగుండం శాసన సభ్యులు రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్ సోమవారం పరామర్శించారు. గత పది రోజుల క్రితం ఆయన తల్లి అమ్మాయి అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో 8వ కాలనిలోని హనుమాన్ నగర్18వ డివిజన్‌లో నివాసం ఉంటున్న ఆయన ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు పెద్దపల్లి జిల్లా ఉపాధ్యాక్షుడు మారెల్లి రాజిరెడ్డి, కార్పోరేటర్ మహాంకాళి స్వామి, దాసరి నర్సింహరెడ్డి, మల్లారెడ్డి తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శబరిమల పాద యాత్రను ప్రారంభించిన భక్తులు



**రాయికల్ అక్టోబర్14(జనం సాక్షి):** రాయికల్ మండలం వడ్డే లింగాపూర్ గ్రామానికి చెందిన యాచమనేని దీపక్ మూడోసారి అయ్యప్ప మాల ధరించాడు. భూపతిపూర్ గ్రామానికి చెందిన ముక్కెర నరేందర్ ఆరోసారి అయ్యప్ప మాల ధరించాడు. రామాజీపేట్ గ్రామానికి చెందిన మామిడిపెల్లి లక్ష్మణ్ ఐదోసారి అయ్యప్ప మాల ధరించాడు.ఈ ముగ్గురు భక్తులు సోమవారం రోజు రాయికల్ పట్టణ కేంద్రంలోని అభినవ శబరిమల అయ్యప్పస్వామి దేవాలయంలో దీక్షను స్వీకరించారు. అనంతరం వారి ఇంటి నుండి శబరిమల పాదయాత్రకు బయలుదేరారు. ప్రతి సంవత్సరం, శబరిమల అయ్యప్ప స్వామి దర్శనం కోసం వేలాది భక్తులు పాదయాత్రలో పాల్గొంటారని, రాయికల్ మండలం నుండి పాద యాత్ర ప్రారంభించిన భక్తులు,తమ ఆధ్యాత్మిక విశ్వాసం మరియు భక్తి కోసం ఈ యాత్రను అంకితభావంతో చేస్తున్నామని తెలిపారు.

## విజయవాడ దుర్గామాత దర్శనానికి కాలినడకన బయలుదేరిన మాల ధారణ భక్తులు



**జమ్మికుంట, అక్టోబర్ 14 (జనం సాక్షి):** దేవీ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా దుర్గామాత ఆశీస్సులతో మాల ధరించి 11 రోజులు ఉపవాస దీక్షలు చేసి మాల విరమణ కోసం జమ్మికుంట నుండి విజయవాడ కు బయలుదేరిన ముగ్గురు యువకులు. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లి కి చెందిన మారుతి రెడ్డి ప్రశాంత్ మహేష్ అనే యువకులు దేవీ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా దుర్గామాత మాల ధరించి భక్తుశ్రద్ధల తో పూజలు చేసి తమ మాల విరమణ కోసం సోమవారం జమ్మికుంట నుండి విజయవాడ కు సుమారు 270 కిలోమీటర్లు కాలినడకన బయలుదేరారు. ఈ సందర్భంగా యువశక్తి యూత్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ నేటి యువత భక్తితో అమ్మవారిని పూజించి కాలినడకన విజయవాడ కు బయలుదేరడం వారికి ఆ దుర్గామాత ఆశీస్సులు ఉండాలని వారి ప్రయాణం సజావుగా సాగాలని కోరుకుంటూ వారిని సాగనంపారు. ఈ కార్యక్రమంలో యువ శక్తి యూత్ సభ్యులు అయితు శ్రీనివాస్, సోనియా, సమత, మల్లికార్జున్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన స్పోర్ట్స్ క్లబ్ క్రీడాకారులకు సన్మానం



**రుద్రంగి అక్టోబర్ 14 (జనం సాక్షి)** రుద్రంగి మండల కేంద్రానికి చెందిన స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన సందర్భంగా స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులు సభ్యుల ఆధ్వర్యంలో ఘనం గా సన్మానం చేయడం జరిగింది. ప్రభు త్వ ఉద్యోగాలు పొందిన అంబటి సాగర్ ఎస్ ఎస్ బి లో ఎస్సైగా, లింగంపల్లి రవి డీఎస్సీ 2024 లో పిటిగా మరియు కబడ్డీలో జాతీయస్థాయిలో పాల్గొన్న అట్టపెల్లి రిషికేష్, మరియు పార ఒలంపియన్ అంతర్జాతీయ క్రీడాకారుడు సింగారపు బాబు లను స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు మరియు సీనియర్ క్రీడాకారులు సోమవారం ఘనంగా సన్మానం చేయడం జరిగింది. స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులు గంగం మహేష్ మాట్లాడుతూ... రుద్రంగి అంటేనే క్రీడలకు పెట్టిన పేరు మా గ్రామానికి చెందిన క్రీడాకారులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం మా గ్రామానికి గర్వకారణం అని అభినందిస్తూ మరింత మంది యువకులు ఉద్యోగాల్లో, క్రీడల్లో, జాతీయస్థాయిలో రాణించాలని తెలియజేస్తూ క్రీడాకారులకు క్రీడా పోటీలలో పాల్గొనే వారికి నా వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలియజేసి క్రీడాకారులను అభినందించడం జరిగింది, ఈ కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు కర్ణవత్తుల చందు, తిగుళ్ళ శ్రీనివాస్ శర్మ,దయ్యాల నారాయణ,రమేష్, పెద్దులు, అంబటి శ్రీనివాస్,అక్కనపెల్లి శ్రీనివాస్,సింగారాపు గంగాధర్, గంగారాజం,గుగ్గిళ్ళ తిరుపతి,రోమాల ఆశోక్,పీఈటీలు అక్కనపెళ్ళి దేవయ్య, అరిపెల్లి రవి,లింగంపల్లి రవి, రాజు,అట్టపెల్లి మల్లేశం,అంబటి రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి సంస్థను అన్నీ రంగాలలో అభివృద్ధి

### రామగుండం శాసన సభ్యులు మాక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్



**యైటింక్లయిన్ కాలని అక్టోబర్ 14 (జనంసాక్షి) :** ఆర్జీ2 ఏరియా యజమాన్యం ఆద్వర్యంలో ఓసిపి-3, సిహెచ్ పి, సెక్యూరిటి విభాగం, మెడికల్ విభాగం, రెస్క్యూ విభాగం మరియు జీఎం ఆఫీస్ ఉద్యోగులకు ఓసిపి-3 కృషి భవన్, సిహెచ్‌పిలలో (రెండు ఏరియాలలో) ఉజ్వల సింగరేణి-ఉద్యోగుల పాత్ర అనే అంశముపై సింగరేణి కాలరీస్ సుస్థిర భవిష్యత్ కోసం సంస్థ ఆర్థిక స్థితి గతులపై ఉద్యోగులకు పూర్తి అవగాహన ఉండాలని సింగరేణిపై సమీక్షా సమావేశము నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రామగుండం శాసన సభ్యులు మాక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ ముఖ్య అతిధిగా హాజరైనారు. ప్రాజెక్ట్ అధికారి ఎస్.మధుసూదన్ కంపనీ యొక్క స్థితిగతులను ఎల్ఇడి స్క్రీన్ పైన పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. సింగరేణి ఉద్యోగులు పని సంస్కృతిలో విప్లవా త్మకమైన మార్పులు తీసుకురావడానికి ఉద్యోగులు సహకరించాలని ఏరియా జనరల్ మేనేజర్ ఎల్.వి. సూర్యనారాయణ కోరారు. ఓపెన్ కాస్ట్ గనుల్లో భారీ యంత్రాలను పూర్తి పని గంటలు వినియోగిస్తూ ఉత్పత్తులు, ఉత్పాదకత పెంచాలని కోరారు. ఈ సందర్భంగా శాసన సభ్యుడు మక్కాన్‌సింగ్ మాట్లాడుతూ.....బొగ్గు పరిశ్రమలో కోల్ ఇండియా కంటే ముందుగా సింగరేణి సంస్థ ఏర్పడి ఈ ప్రాంత ప్రజలకు జీవనాధారమైంది. ఈ సంస్థ ద్వారా ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాది దొరికే విధంగా సింగరేణిని ఇతర రంగాలలో అభివృద్ధి చేసే విధంగా ఈ ప్రభుత్వం ప్రణాళికలు చేస్తుందని రామగుం డం ఏంఎ ల్ఏ మాక్క న్ సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు. ముఖ్యమ ంత్రి, ఉపముఖ్య మంత్రి, మంత్రి శ్రీధర్ బాబు గార్ల సహకారంతో రామగుండంకు పూర్వ వైభవం తీసుకురావడం కోసం పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం జరుగుతుంది, వచ్చిన లాభాలలో ఉద్యోగులకే కాకుండా ఒప్పంద ఉద్యోగులకు 5 వేల రూపాయలు ఇచ్చే విధంగా నిర్ణయం తీసుకోవడం జరిగినని, అలాగే సింగరేణి ఉద్యోగులకు సొంత ఇంటి కలను నిజం చేయడం జరుగుతుందని వారు అన్నారు. అనంతరం వారు ఉద్యోగులతో కలిసి సహపంక్తి బోజనము చేశారు. ఈ కార్యక్రమాలలో గోదావరిఖని ఏసీపీ మడత రమేష్, ప్రాజెక్ట్ అధికారి ఎస్.మధుసూదన్ ఏఐటియుసి బ్రాంచ్ సెక్రెటరీ జిగురు రవీందర్, అధికారుల సంఘం ప్రతినిధి జనార్ధన్, ఏరియా ఇంజినీర్ నరసింహారావ్, అఫిషియేటింగ్ ఎస్ఓటుజిఎం ఎస్.సంతోష్ కుమార్, డిజిఎం పర్సనల్ ఎస్.అనిల్ కుమార్, డిజిఎం వర్క్‌షాప్ ఎర్రన్న, డిజిఎం ఐఇడీ మురళీకృష్ణ, డిజిఎం ధనుంజయ, డిజిఎం ఫైనాన్స్ వెంకట రామచంద్ర, ఎస్ఇ సిహెచ్‌పి సదానందం, ఏరియా సర్వే అధికారి బుక్య దేశాయి, ఓసిపి3 మేనేజర్ భారత్ కుమార్, మెడికల్ సూపరింటెండెంట్ డా.మహిపాల్, రెస్క్యూ సూపరింటెండెంట్ మాధవ రావ్, సీనియర్ సెక్యూరిటీ అధికారి షరీఫ్ మహమ్మద్, గోదావరిఖని టూ టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రసాద్ రావ్, డివైపిఎంలు నలివెల్లి వేణుగోపాల్, నందికొండ వంశీధర్ సంక్షేమాధికారి రాజు తదితరులు పాల్గొన్నారు.



## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులుగా ఎన్నికైన వారికి సన్మానం



**రుద్రంగి అక్టోబర్ 14 (జనం సాక్షి)** ఇటీవల ప్రభుత్వం డీఎస్సీ 2024 ద్వారా ఎన్నికై ఉపాధ్యాయ వృత్తిలోకి అడిగిడుచున్న రుద్రంగి గ్రామానికి చెందిన ఐదుగురు అభ్యర్థులైన గడప వేణు కుమార్, లింగంపల్లి రవి,శీలం మానస, తరే సంగీత లకుసన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమములో లయన్స్ క్లబ్ రుద్రంగి భాద్యులు మాట్లాడుతూ... ఎంతో శ్రమ పడి ప్రభుత్వ ఉపాద్యాయులు గా ఎన్నికైన వారికి శుభాకాంక్షలు తెలియ చేస్తూ,భవిష్యత్ లో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దవలేనని కోరారు. ఈ కార్యక్రమం లో లయన్స్ క్లబ్ అద్యక్షులు లయన్ గోడీకర్ హీరోజి, సెక్రెటరీ లయన్ బండి యాదగిరి,ట్రెజరర్ లయన్ కొమిరే శంకర్ డిస్ట్రిక్ట్ క్యాబినెట్ మెంబర్ లయన్ తిపిరెడ్డి వెంకట్ రెడ్డి, డిస్ట్రిక్ట్ సపోర్టింగ్ టీం మెంబర్ లయన్ గడప రఘుపతిరావు,పాస్ట్ ప్రెసిడెంట్స్ లయన్ అంబటి శంకర్,లయన్ కర్నవత్తుల దేవేందర్ రావు,లయన్ పుట్కపు మహేష్,లయన్ మంచే రమేష్,లయన్ మంచే రాజేశం పాల్గొన్నారు.

## గుండెపోటుతో యువకుడు మృతి



**తంగళ్ళపల్లి అక్టోబర్14(జనం సాక్షి).** తంగళ్ళపల్లి మండల కేంద్రంలో జంగపెల్లి బాబు అనే 23 సంరాల యువకునికి ఈరోజు ఉదయం వేకువజామున గుండెలో నొప్పి రావడంతో హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. చిన్న వయసులోనే గుండెపోటుకు గురై మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుగా మున్నీరుగా విలపిస్తుంటే గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతునికి తల్లి ఎల్లవ్వ, తండ్రి శ్రీనివాస్ ఉన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సదుపాయాలు కల్పించాలి



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 14 (జనం సాక్షి)**వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మౌళిక సదుపాయాలు సమకూర్చాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. సోమవారం రోజున కలెక్టరేట్ సమావేశ మందిరంలో పౌరసరఫరాలు, వ్యవసాయం, పాక్స్, తదితర శాఖల అధికారులతో వరి కొనుగోళ్లపై సమావేశం నిర్వహించారు. కొనుగోళ్లు ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో 419 వరి కొనుగోళ్ళ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఇందులో 392 వ్యవసాయ పరపతి సంఘం 27 ఐ.కే.పి. కేంద్రాల ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. కేంద్రాల్లో అవసరమైన తేమ కొలిచే యంత్రం, టార్పాలిన్, గాని సంచులు, ఫ్లెక్సీ, త్రాగునీరు వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అన్నారు. సి.ఏం.ఆర్. సేకరణ పూర్తి చేయాలని, మిలర్లతో ఎప్పటికప్పుడు మాట్లాడాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డి.శ్రీనివాస్ రెడ్డి, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ రాజేందర్, జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా మార్కెటింగ్ అధికారిని రమ్య, జిల్లా సహకార అధికారి, డిప్యూటీ తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

## ఇంట్లో దొంగతనం

గాంధారి అక్టోబర్ 14 (జనం సాక్షి)దసరా పండుగ నిమిత్తం 10 రోజుల క్రితం తన జువ్వాడి నుండి తన సొంత ఊరికి వెళ్లారు. ఎన్ ఐ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం గాంధారి మండల జువ్వాడి గ్రామంలో గల వడ్ల పండరి సొంత ఊరు సంగమేశ్వర్ కు వెళ్లి తన అల్లుడి దగ్గరికి ఈరోజు ఉదయం 9 గంటలకు వచ్చేసరికి దాబా పైనుంచి ఇంట్లోకి వెళ్లి బెడ్ రూమ్ లో గల బీరువాను పగలగొట్టి బీరువాలో గల పది తులాల వెండి, ఇత్తడి వస్తువులు, ఇత్తడి బిందెలు చెంబులు దీపాంతాలు దొంగతనం చేసినారని అల్లుడు కమ్మరి స్వామి ఫిర్యాదు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

# ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలి

### ఆర్మూర్ యుఎస్ఎఫ్ఐ డిమాండ్



**ఆర్మూర్, అక్టోబర్ 14 ( జనంసాక్షి):** భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ యుఎస్ఎఫ్ఐ నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆర్మూర్ పట్టణంలో పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను చెల్లించాలని సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యుఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిద్దల నాగరాజు మాట్లాడుతూ ప్రైవేటు కాలేజీలలో స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ పై ఆధారపడి చదువుతున్న విద్యార్థుల బతుకులను భవిష్యత్తును ప్రశ్నార్థకంలో పడేసే రకంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని అందుకు నిదర్శనం పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయకపోవడమేనని అన్నారు. అదేవిధంగా తాము అధికారంలోకి వస్తే విద్యారంగానికి బడ్జెట్లో పెద్దపీట వేస్తామని చెప్పి తీరా విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి చెల్లుతుందని అన్నారు. అదేవిధంగా గత ఆరేడు సంవత్సరాల నుండి స్కాలర్షిప్ %డ% ఫీజు రియంబర్స్మెంట్ సరైన సమయంలో రాక విద్యార్థులు,విద్యాభ్యాసం పూర్తయిన తర్వాత పై తరగతులకు లేదా ఉద్యోగాల కోసం వెళ్లినప్పుడు సర్టిఫికెట్స్ లేక తాము చదివిన ప్రైవేటు కళాశాలలో ఫీజులు కట్టి సర్టిఫికెట్లు తీసుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ వలన రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రైవేటు డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న టీచింగ్ అండ్ టీచింగ్ స్టాఫ్ కి జీతాలు చెల్లించలేక కాలేజ్ నిర్వహణ చేయుటకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు డిగ్రీ కళాశాల యాజమాన్యాలు,కళాశాల బందుకు పిలుపునివ్వడం జరిగిందన్నారు. దీనికి యూఎస్ఎఫ్ఐ రాష్ట్రవ్యాప్తంగా మద్దతు తెలియజేస్తుందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ విడుదల చేయాలని లేనియెడల రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి సంఘాలు ఉద్యమాలు ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పోషమైన మహేష్, గణేష్ మరియు బోధన్,ఆర్మూర్ డివిజన్ అధ్యక్షులు రాజు,జవహర్ మరియు ఆర్మూర్ డివిజన్ నాయకులు సురేందర్, అఫ్ఫాన్,అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

# వైన్స్ షాప్‌లో దొంగతనం

### 50వేల నగదు, 50వేల మద్యం చోరి



**యైటింక్లయిన్ కాలనీ అక్టోబర్ 14 (జనంసాక్షి) :** గోదావరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కోల్‌కారిడార్ రోడ్డులో గల రాజారాజేశ్వరీ వైన్ షాప్‌లో దొంగతనం జరిగినట్లు టూటౌన్ సీఐ ఎన్. ప్రసాద్ రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం అల్లూరు కోల్‌కారిడార్ రోడ్డులో గల వైన్‌షాప్‌లో అర్ధరాత్రి సిమెంటు రేకుల పగులగొట్టి గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడినట్లు తెలిపారు. సోమవారం వైన్‌షాప్ తెరిచేసరికి రేకుల పగులకొట్టి ఉండడంతో షాప్ యాజమాని సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. దీంతో వెంటనే క్లూస్‌టీంకు సమాచారం ఇచ్చి షాపులో ఆధారాల కోసం తనిఖీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ చోరిలో 50వేల నగదుతోపాటు 50వేల విలువగల మద్యం ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# రుద్రంగిలో అంబరాన్నంటిన సద్దుల బతుకమ్మ సంబరాలు

### వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

### దసరా తర్వాత ఇక్కడ బతుకమ్మ వేడుకలు జరగడం ఆనవాయితీ



**రుద్రంగి అక్టోబర్ 14 (జనంసాక్షి) :** రుద్రంగి లో సోమవారం సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. ఇక్కడ దసరా తర్వాత బతుకమ్మ పండుగ జరుపుకోవడం అనాదిగా వస్తున్న ఆనవాయితీ, ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రభుత్వం విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్... ఇక్కడ ఆడపడుచులకు తల్లిగారింట్లో, అత్తగారింట్లో సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించుకునేందుకు మహిళలకు అవకాశం ఉంటుంది. దీంతో మేజర్ గ్రామమైన రుద్రంగిపోయిరా గౌరమ్మ... పోయిరావమ్మా... అంటూ బతుకమ్మలకు ఘనంగా వీడ్కోలు పలికారు. గ్రామ పంచయతీ కార్యదర్శి రాందాస్ ఆధ్వర్యంలో బతుకమ్మ కుంట వద్ద ఏర్పాట్లు చేశారు. నిమజ్జన అనంతరం ఆడపడుచులు పసుపు కుంకుమలు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రజా ప్రతినిధులు గ్రామ ప్రజలు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించి సత్వర చర్యలు తీసుకోవాలి



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 14 (జనం సాక్షి)** ప్రజావాణి లో వచ్చిన అర్జీలను పరిశీలించి సత్వర చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని వివిధ సమస్యలపై దరఖాస్తు దారుల అర్జీలను సమర్పించారు. ఆయా దరఖాస్తులను పరిశీలించి తగు చర్య నిమిత్తం సంబంధిత అధికారులను అందజేశారు. ప్రజా వాణి అనంతరం ఇందిరమ్మ కమిటీలు, ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తులు, ప్రజావాణి పెండింగ్, ధాన్యం సేకరణ అంశాలపై అధికారులకు కలెక్టర్ సమీక్షించి పలు సూచనలు చేశారు. ఇందిరమ్మ కమిటీలను వెంటనే ఏర్పాటు చేయాలని, ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయడం జరిగిందని తెలుపుతూ,గ్రామ స్థాయిలో, మున్సిపల్ వార్డ్ స్థాయిల్లో కమిటీలను ఏర్పాటు చేయాలని అన్నారు. అట్టి కమిటీల వివరాలు తెలుపుతూ సంతకం చేసిన జాబితాలు సమర్పించాలని అన్నారు. ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తుల మేరకు సర్వే టీమ్ లు ప్రభుత్వ నిబంధనల మేరకు సర్వే త్వరితగతిన చేయాలని అన్నారు. క్షేత్ర స్థాయిలో సంబంధిత అధికారులు పరిశీలన చేయాలని తెలిపారు. ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సత్వర చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా గత వారం వరకు 18182 అర్జీలను రాగా వాటిని పరిశీలించి సంబంధిత అధికారులు 17,455 అర్జీలను పరిశీలించి చర్యలు తీసుకోవడం జరిగిందని, మిగతా 727 అర్జీలలో 533 పెండింగులో ఉన్నాయని, 194 దరఖాస్తులు ఇతర శాఖలకు చెందినవి కాగా వాటిని ఆయా శాఖలకు బదిలీ చేశారని తెలిపారు. సోమవారం 49 అర్జీలు రావడం జరిగాయని తెలిపారు. పెండింగ్ లో ఉన్న అర్జీలను పరిశీలించి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధాన్యం సేకరణకు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఆయా కేంద్రాలలో కనీస సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను సంబంధిత మండల, జిల్లా స్థాయి అధికారులు పరిశీలించాలని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి.శ్రీనివాస్ రెడ్డి, జడ్పీ సి.ఈ. ఓ. చందర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఖుల్లా వంటనూనె .. కల్తీ వ్యాపారం జోరుగా..



**బిచ్కుంద అక్టోబర్ (జనంసాక్షి)** కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గ పరిధిలోని బిచ్కుంద మండలకేంద్రంలో వంట నూనెల కల్తీ వ్యాపారం జోరుగా సాగుతుంది. పలు కంపెనీల బ్రాండ్‌లను వినియోగిస్తూ కల్తీలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పల్లెల నుంచి వస్తున్న ప్రజలకు తక్కువ ధరలకు ఆశ చూపించి నాణ్యతలేని వంట నూనెలను విక్రయిస్తున్నారు. కల్తీ నూనెలను విక్రయిస్తూ అమ్మకందారులు లక్షల్లో జేబులు నింపుకుంటున్నారు. నాణ్యత ప్రమాణాల శాఖ ఉన్నప్పటికీ ఆ వైపు కన్నెత్తి చూడకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తుంది. ఆయిల్ మిల్లుల వ్యాపారులు, హోల్ సేల్ గా ఆయిల్ తెచ్చి ఇక్కడే కల్తీ చేసి విక్రయాలు జరుపుతున్నట్లు తెలుస్తుంది. అంతేగాకుండా మండల కిరాణా అసోసియేషన్ అధ్యక్షుడు ఏకంగా అనుమతులు లేకున్నా ఖుల్లా వంటనూనెను అమ్ముతుండడం గమనార్హం. ఈ వ్యాపారంలో ఆరితేరిన కొంతమంది రూ.కోట్లకు పడగలెత్తారు. విడి వంటనూనె అమ్మరాదు...ఫుడ్ ఇన్స్పెక్టర్...కిరాణా షాపుల్లో విడి వంటనూనె అమ్మకూడదని జిల్లా ఫుడ్ ఇన్స్పెక్టర్ పేర్కొన్నారు. ఎవరైనా ఖుల్లా వంటనూనె, టొబాకో కలిగిన గుట్కాలు అమ్మడం నేరమని తెలియజేశారు. ఎవరైనా అక్రమార్కులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# బాధిత కుటుంబాలను పరామర్శించిన చైర్మన్




**కమ్మర్పల్లి14అక్టోబర్(జనంసాక్షి)**మండలంలోని హాసకొత్తూర్ గ్రామంలో ఎల్లేటి గంగాధర్ కుటుంబ సభ్యులను మరియు బుచ్చి మల్లయ్య ను సోమవారం రోజున రాష్ట్ర ఖనిజ అభివృద్ధి శాఖ చైర్మన్ ఈరవత్రి అనిల్ పరామర్శించారు. చైర్మన్ వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకేట రవి, కాంగ్రెస్ నాయకులు అబ్దుల్ రఫీ, నిమ్మ రాజేంద్రప్రసాద్, పడిగేల ప్రవీణ్, రేవతి గంగాధర్,మేకల క్రాంతి, చిటికేసి రఘు,సుంకెట శ్రీనివాస్,ఏనుగు రాజేశ్వర్ కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

# నిజామాబాద్ డిసిసిబి వైస్ చైర్మన్ పదవిని ఎస్సీలకే కేటాయించాలిదళిత సంఘాల డిమాండ్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 14 (జనం సాక్షి)**నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలోని డిసిసిబి చైర్మన్గా ఉన్న భాస్కర్ రెడ్డి పై అవిశ్వాసం పెట్టి రమేష్ రెడ్డి అనే ఒక రెడ్డి సామాజిక వర్గానికి చెందినటువంటి వ్యక్తికి ఉమ్మడి జిల్లా చైర్మన్ పదవి ఇవ్వడం జరిగింది. ఇంతకుముందు ఖాళీగా ఉన్న డీసీఎంఎస్ చైర్మన్ ఎస్ టి సామాజిక వర్గానికి చెందిన తారా చంద్ ను నియమించడం జరిగింది. ఐడీసీఎంఎస్ వైస్ ఛైర్మన్ గా రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ఇంద్రసేనా రెడ్డి ని నియమించారు. నిజామాబాద్ జిల్లా డీసీసీబీ మరియు డీసీఎంఎస్ చైర్మన్ ను ఇంతవరకు ఎస్సీ ని నియమించకపోవడం ఎస్సీ ల పట్ల పార్టీలు చూపిస్తున్న వివక్ష స్పష్టంగా కనిపిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం డిసిసిబి వైస్ చైర్మన్ గా ఒక ఎస్సీ నీ నియమించి ఎస్సీల పట్ల కాంగ్రెస్ వైఖరి నిరూపించుకోవాల్సిందిగా డిమాండ్ చేస్తున్నామన్నారు. ఒకవేళ ఎస్సీలకు కాకుండా రెడ్డి అగ్రవర్ణ వాళ్లకి డిసిసిబి వైస్ చైర్మన్ ఇస్తే స్థానిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పవలసి వస్తుందని హెచ్చరించారు. ఎస్సీల ఓట్లు అవసరం గానీ ఎస్సీలకు పదవులు ఇవ్వడం ఇష్టం లేని నాయకులకు తగిన బుద్ధి చెప్తామన్నారు. గౌరవ ముఖ్యమంత్రి గారు స్థానికంగా ఉన్న ఎమ్మెల్యేలు ,కాంగ్రెస్ నాయకుల వల్లనే ఎస్సీల పట్ల చిన్నచూపు జరుగుతుందని వాళ్ళు మారకపోతే తగిన మూల్యం చెల్లించుకోవలసి వస్తుందని హెచ్చరించారు. కావున ఇప్పటికైనా డిసిసిబి వైస్ చైర్మన్గ గా ఒక ఎస్సీ అభ్యర్థిని చేయవలసిందిగా కోరుతున్నామన్నారు దీనిలో అన్ని అంబేద్కర్ సంఘం ,మాదిగ హక్కుల పోరాట సమితి, మాల మహానాడు, దళిత సంఘాలు బీసీ సంఘాల నాయకులు కోతోళ్ల గంగారాం, కొత్తపల్లి మల్లన్న,సాపశివరాం,బీవీఎంవిట్ఠల్, ,గైని రాజు, తదితరులు పాల్గొన్నారు.

# విజిలెన్స్ కమిటీని పొడిగించాలి



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 14 (జనం సాక్షి)**విజిలెన్స్ కమిటీ పొడిగించాలని కొత్తపల్లి సుధాకర్, ఎడ్ల రాజులు కోరారు జిల్లా కలెక్టర్ చైర్మన్ గా వ్యవహరిస్తున్న విజిలెన్స్ కమిటీ మెంబర్ గడువు 11 ఏప్రిల్ 2024 వరకు పూర్తయినదని దీనికి చాలామంది డిగ్రీ చదివిన వివిధ సంఘాల నాయకులు మరియు ఇతర అభ్యర్థులు ఇందులో కమిటీ మెంబర్ ఉండడానికి అప్లై చేసుకోవడానికి జిల్లా కలెక్టర్ గడువు తేదీని పొడిగించాలని కోరారు. ఈ దరఖాస్తును పరిగణలోకి తీసుకొని జిల్లాలో చాలామందికి విజిలెన్స్ కమిటీల అవకాశం కల్పించాలని మరోసారి జిల్లా కలెక్టర్ కోరుతూ జిల్లా పరిపాలన అధికారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎడ్ల రాజు. కొత్తపల్లి చిట్టిబాబు పాల్గొన్నారు.